వేముల ఎల్లయ్య

కత్తి, ఆరెను పదును బెడ్తున్నాం

13\. కొలానికి తెగలు చేసి
కల్లాల చుట్టూ ఆకలి లేక్రై
సేద్యానికి సేవలకు సానెం తునకలమై
కారుకు కట్టడి మా చుట్టూ కల్లమై
ఎట్టి ఒక కాడై
మా మెడపై కదులుతూనే వుంది.
తెల్లారినా పొద్దుగూకినా
మడి ఒరాల మీద
నా అస్థిపంజరమే కాపలాదారైతే
నెనరు ఎరుగని వర్ణం
ఏడ ముళ్ల కంచై
ఒల్లునిండా గుచ్చుకొని జల్లడైంది
పనుగడి ముందు నీ కులం
పొద్దుతిరుగుడు పువ్వైతే
మా ఇంటిముందు తాటాకో
చీకి చెప్పో వృత్తి చిహ్నాలై
మా చిరునామా చూపుతాయి
మీ అడుగులు
మామునేల్లపై కదిలిస్తేనే కదా
తోలుపై అచ్చులు గీసింది
తెల్లని నీ అడుగుల కింద
నల్లని నా ఎండ్రాయి మొకం



పొట్టకెల్లని అగచాట్లు
కడుపులో కల మెదుల్తున్నా
పేగుల్ని మడత పెట్టుకుని
కరక్కాయని కరుగదీసి
గొర్జం చేదుని నెమరేస్తూ
లందెలో మక్కించి పొతం చేసి
పండిన నా తోలుపంట
నా గుండెలపై తొక్కుతుంటె
నీ అడుగులకింద నలిగిన
నా తాత తరాల్ని చూసుకున్న వాణ్ణి
వూర్లో రంకేస్తున్న వర్ణ కోడెలకు
గుదెలు కట్టి తిత్తి ఒలిచే ఒడుపు
ఎట్లాగో తెలుసు
సమరు గురిగిలో మరిగిన
జీడిగింజ పొంగునై
పచ్చినెత్తురు మీద
నా నిలువెత్తు నీడను చూసుకొని
కత్తి, ఆరెను పదను పెడ్తున్నా.

ఆశావాది శశాంకమౌళి

పెద్దింటోళ్ళ శ్వేతప్రతం

14. ముసుగులెందుకు
స్పష్టంగానే మాట్లాడుకుందాం
మీరుచెప్పే శాస్త్రీయ పంథాల్లోనే మాట్లాడుకుందాం
మీక్కావల్సిన లెక్కల ప్రకారమే చర్చించుకుందాం
షెడ్యూల్డుకులాల ఉమ్మడి కుట్రలో
మట్టికొట్టుకుపోయిన "మాదిగలెంతమంది?
పై చదువుల పట్నందాక
నెట్టుకొచ్చిన "పెద్దింటోళ్లెం"త మంది?
సోకాల్డ్ దళిత "కత్తు" లు
"మాల" రోగంతో ఆడుతున్న
"బహుజన" నాటకాలెన్ని?
"నదిపుట్టినగొంతుకల్ని" మరచి
ఉపకులతత్వంతో కూస్తున్న
"ప్రతిభ" వంతమైన కూతలెన్ని?
అంటరాని సత్యాలను మింగిన
బాపన కొండచిలువల చరిత్రలా
"అరుంధతీయుల్ని" ముంచిన మాలలకథల్ని
వెలికి తీసి తెరకెక్కించాం చూడండి
కాకలు తీరాల్సిన "తప్పెట్ల"ను
కాల గర్భంలోకి నెట్టేసిన "బ్యాగారోళ్ల"పై
శ్వేతపత్రం విడుదల చేసాం చదవండి
"ప్రతిభ"ంటే ఏంటి "వకీలు" గారూ?
"ఏనుగు" తోక పట్టుకొని
"ఎర్రకోట" నెక్కేయాలని
గొంతుసవరించుకొని
జెండామార్చేయటమా?
"ఐకమత్యమంటే" ఏంటి "మాస్టరు" గారూ?
"దళితరాజ్యం" ఫోజులు పెట్టి



"మాల" రాజ్యం బీజాలు నాటుకోవటమా?
"కులరహితసమాజ" నినాదాలిచ్చి
పీఠంకై "పంతుళ్ల" తో లాలూచీ పడటమా?
నమస్తే కవి 'రత్న' గారూ!
గొడ్డుసాకిరీ సేసినా
పొద్దుగూంకులూసావుదెబ్బలుతినే
మాయమ్మకు
మాలయ్యే పెదాన సెత్రువు
పీడితులు
దళితులు
అంటరానివారు
ఏముసుగైతేనేమి?
"మాల" భావన సార్వభౌమికమైనది
జైబోలో మాలల ఐకమత్యానికీ ......
ఉన్నది ఒక్క రొట్టె ముక్కే అయినా
ఆకలి పేగులని నిష్పత్తి ప్రకారం
పంచుకు తినడం న్యాయసమ్మతం
న్యాయం తప్పినా తప్పించబడినా
ఈ "ఆదిజాంబవ సంతతి"
తాట ఒలిచి తడాఖా చూపిస్తుంది
ఈ"దండోరా" లే రేపు డైనమైట్లై
రిజర్వేషన్ల కుట్రను ఎ.బి.సి.డిలుగా భగ్నం చేస్తాయ్.

15. ఇద్దరం

ఆళ్ళ గడపదాకైనా పోకుండా
ముని ఆకిట్లోనే చెక్కు చెక్కు మంటూ
బిక్కమొఖాలతో ఆగినోళ్ళం
..... సెత్, గసుంట ఇంకసుంట అన్న ....
గాళ్ళ ఉంకరింపులకి కుత,కుత కుమిలి
అగమానంతో అల్లాడినోళ్ళం
గాళ్ళ ఇసిక్కిసూపులకీ కిసిక్కినవ్వులకీ
ఎక్కిలింపులకీ కొక్కిరింపులకీ
ఇజ్జత్ ఇడిసి బతికినోళ్ళం
అడ్డిపావుసేరుకి
బతుకుల్ని కుదవబెట్టుకుని
ఆడిగద్దింపులకి గానుగెద్దుల్లా
బతికి నోళ్ళం
ఎట్టయితేంది
ఊరోళ్ళ ఆకిల్లకాడ
మనఅడుగుల తాహత్తు ఒక్కటె
గదిసరే



అక్కడ నువ్వునాకు నేను నీకు
ఒకళ్ళకొకళ్ళం తోడుండబట్టె
గియ్యాలగాడి ఆకిట్ల పల్లేరుకాయలు కాస్తున్నయ్
మరినువ్వు ....
ఊరిలో ఉద్దెమానికి
చేతులు కలపమన్నోడివి
వాడకు సేకంగనే ఒంటెద్దు పోకడపోతవేంది?

చిత్రం ప్రసాద్

చాటింపు

నావాడలో
సకల మర్యాదలు పొంది
నీ వాడలో సచ్చేంత అగమానాన్ని
అంటగడత వేంది?
నా బతుకు నేనే చూసుకునే బుద్ధికాదునాది
అగమనాన్ని నల్గురం పొందినం
హక్కుల్ని నల్గురం పంచుకుందాం
బుజాల మీద చేతులేస్తే
సోపతిగాడివనుకున్న
జేబుల చిల్లర పోయాకే తెల్సింది నీ సోపతేందో?
ఇంకా ముసుగుల గుద్దలాటేంది?
వాటాలు పంచుకుందాం రా!
నీ పిడికెడు నువ్వేతీసుకో!
మూసిడికిళ్ళల్ల కూడా చెయ్యిపెట్ట చూడకు
నీ మాటకారి తనంతో
మళ్ళీ మాయపుచ్చాలని చూడకు
ఇప్పుడు ఇద్దరం ఎదురుపడి
నిప్పుల్ని కాదు కక్కాల్సింది
నిజాలు మాట్లాడుకుందాం రా!
నాదండు రచ్చబండకాడ చర్చ పెట్టింది.
కణ కణ మోగే నా డప్పు చప్పుల్ల చాటింపు మధ్య
ఏకపటం లేకుండా నా నినాదానికి
గొంతు కలపగలిగితేరా !
నాదండుని కొత్తగా పరిచయం చేస్తా!


శంబుక

నాడు - నేడు

16. "ఈ రాజ్యాంగం పేదలకు ఉపయోగపడక పోతే
దీనిని తగల బెట్టే వాళ్లలో
నేను మొదటి వాణ్ణి అవుతాను" అని
శపథం పూనాడు అంబేడ్కర్ - ఆనాడు
ఈ రాజ్యంగం నీడలో
నలబై ఏడు నుండి పేదలు భిక్షగాళ్లగా
ధనికులు మరింత కుబేరులుగా
దినదిన ప్రవర్ధమానం అవుతుంటే
"ఈ రాజ్యాంగమే మాఊపిరి" అంటూ
కదంతొక్కుతున్నారు అంబేడ్కరైట్స్- ఈ నాడు.

("పోయేదేమీలేనోళ్ళం" - నుండి)

17. అడక్క తింటున్న నాగిన్నె సాచ్చిగా
ఒళ్లంతా ఆంకారమే నీకు
మెత్తని పులివి, నిన్ను
సెమించక "వెలి" ముల్లునే బాకును సేత్తా
నీసాహిత్య ఎన్నుమునకు దొరకబట్టి
సరిపెయ్యడానికే
నా సాహిత్య వలను ఇసురుతున్నా......
అత్రశత్రాలన్ని సేతబూని
మా శవాల మీద ఊరేగి గద్దెక్కావ్
నీ పాపాన్ని పోగొట్టుకోవడానికి
నా కన్నిటితో తానమాడుతానంటావ్?
నీకూ నాకూ మద్దెదూరం
రెండు ధృవాలకున్నంతయినా
నా మీదే పెత్తనం సెలాయిత్తనంటవ్?
నన్ను నల్లోన్ని సేసావ్!
నాకు సొమ్ము ఒద్దంటావ్
నా ఆప్యాయతను సెదరించుకుంటావ్!
నాకు శాంతే లేకుంటసేసావ్!,
ఒరే ...... ఇంకా ......
నా మీద నీకు పెత్తనం ఏంటిరా?
కుళ్లిపోయిన పుండ్లుతో
లేవలేని సత్తువతో రాత్తున్నా!
నేను మునుపటి బక్కోన్ని కాదు
సింగారించుకున్న
నీ సారస్వతం చీరలూడదీసి
నగ్నంగా
నడిబజార్లో నిలబెట్టి



కనకయ్య

నల్లోని దండోర....

గొంతుకలు తెగ్గోసే సంజీవిని
నీ దగుల్బాజీ లెక్కలు
నాదగ్గర సాగవు
దండోరా వేసి సెపుతున్నా ....
ఏద మంత్రాలతో
నా గుండెకు సిల్లులు సేసి
నాసెరిత్రమీద కాండ్రించిన
నిన్నూ - నీ ధర్మ శాత్రాలను
వర్ణకోక నా మీదగప్పి
స్టేజీ లెక్కి
శాలువాలు గప్పకొంటున్న
నీ నాగరికత వారసులను
ఇచ్చుక పోతున్న నీ సంస్కృతిని
నీ సంస్కృత ఉపన్యాసాలను
సొరత్తాలో
రచ్చబండమీదేసి
సితిని కాలిసినట్టు
కాలిసి పారేత్తా
దళిత బ్రాహ్మణ వాదులారా
మిమ్ములను కూడా ఎలేత్తున్నా
దూరంగా ఎల్లిపోండ్రి
మీ సాహిత్యాల్ని
మీసేతుల్లో పెడుతున్నా
ఆపై మీ ఇట్టం.

ఎం. జాన్‌సన్

మాదిగ చైతన్యం

18. ఆదిలోన మాది
అంటరాని కులమట!
కాని జాబిలికన్నా
జాజిమల్లి మనసుమాది
చాతుర్వర్ణ వ్యవస్థ పాదాలకింద
నిర్దాక్షిణ్యంగా నలిగిన ఆది శేషులం
తరతరాలుగా ఈ వ్యవస్థను రక్షిస్తు
రక్షణ కోల్పోయిన అభాగ్యులం
శ్రీరాముడిని దేవునిగా మార్చడానికి
ప్రాణాలనే అర్పించిన శంబుకుణ్ణి నేను
ద్రోణాచార్యుడి కుట్రకు కానుకగా
బొటనవ్రేలు కోసి ఇచ్చిన ఏకలవ్యుణ్ణి నేను
ఏ ప్రళయం వచ్చినా
ఏవ్యాధి శోకినా
ఏ మానవుడు ప్రవేశించలేని పరిస్థితులున్నా
ధైర్యంగా ఆదుకునే సాహసం మాది
మాదిగలం మేము!
ఈ వ్యవస్థ ఉక్కు పాదాల కింద నలుపుతుంది
మేము కళ్లు తెరుస్తున్నావని తెలియగానే
అసహనంతో బుసులు కొడుతున్న సర్పమాల
ఒరేయ్ ....
మాదిగా !
మన కళ్లు పెరకడానికి ప్రయత్నిస్తుంది
లేరా సోదరా !
నవ చైతన్యంతో కళ్లు తెరచి
కాలం పై మన యుద్ధాన్ని ప్రకటిద్దాం!



రావినూతల ప్రేమకిషోర్

దండోరా



19. ఇన్నాళ్లకు నాగొంతు విప్పుతున్నా
ఇప్పుడు నాది అగ్నిగళం
వాడు
మనల్ని కాడెద్దుల్ని జేసి
చంద్రకోల విసురుతున్నప్పుడు
నీతోపాటు దెబ్బలు తిన్నోణ్ణి
మనల్ని సమాంతరాలుగా విడగొట్టి
పబ్బంగడుపుకున్నప్పుడు
నీతోపాటు దుఃఖించినోణ్ణి
వాడికి కోపమొచ్చి "మాదిగనా కొడకా!"
అని నిన్ను తిట్టినప్పుడు
నీ బదులు తిట్లూ అవమానాలూ భరాయించినోణ్ణి
నీతో జత కలిసినోణ్ణి
నీతో శృతికలిపినోణ్ణి
ఇది నిన్నటి మాట
కాని ఇప్పుడో ...
నామల్లనీవే పగులకొడుతున్నప్పుడు
నా బువ్వనీవే లాక్కున్నప్పుడు
ఇక నాది 'మైలుధూరం' బుద్ధికాదు
దున్నపోతులా మొద్దుగా బ్రతకలేను
పగిలిన నా మల్ల సాక్షిగా చెబుతున్నా
చిట్లిన నా డప్పు మీద దండోరా వేసి మరీ చెబుతున్నా ...
బ్రతుకు కోసం పోరుతున్న శంబూకుణ్ణి నేను ...
నా తలతెగితే మొండెంతోనైనా
నా హక్కుల్ని సాధించి తీరుతానని తెగేసి చెబుతున్నా
బ్రతుకంతా పోరాటం చేసి
రాటుదేలిన మూల వాసుణ్ణి నేను ...
కరవాలం దూయడం కొత్తేమీకాదు
తప్పెట మీద సిటికెన పుల్లేసినంత సులువు నాకు
ఇదిగో
నిన్నటి దాకా "ప్రతిభ ... ప్రతిభో" అని వాడు
గొంతు చించుకుంటుంటే వాడి
కప్పదాట్ల ప్రతిభని చూసి గేలిచేసి నోళ్ళం
ఇప్పుడు నీవూ ప్రతిభని వల్లిస్తుంటే
వాడిని చూసినట్టే నిన్నూ చూస్తున్నా
తేడా నా చూపులో కాదు నీ ధోరణి లోనే
ఇప్పుడు నాది ఇంటి పోరాటం తర్వాతే ఏదైనా
ఇక్కడ నీకెంతో నాకూ అంతే
నా భాగంనాదే ... తీయ్ వాటాతీయ్ ...
నీ ముద్దలాక్కోవాలనే కక్కుర్తి నాదికాదు
నా హక్కుల కోసమే ఈ పోరాటం
అంతర్యాలతో సహజీవనం చేయలేను
మాయమాటల్తో మల్లను మళ్ళీ పగుల గొట్టుకోలేను
ఇప్పుడు
మల్లలన్నీ మేల్కొన్నాయ్
దండోరా వేస్తున్నాయ్

దర్శనం గౌతమ్

ముందు వెనుక దగా

20. దగా దగా
ముందు దగా వెనకదగా
ఎక్కడ చూసిన దగా
దళితుల బ్రతుకంతా దగా
మాదిగల బ్రతుకంతా మరీ దగా ...
కరువు కోరల్లో బ్రతుకు భారంతో
ముష్టివానికన్నా మృత్యువు నెదిరిస్తున్నా
అరచి అరచి ఆరిన గొంతుల ఆవేదనతో
ఆ ఆవిరితోనే ఆర్తిగా అర్తిస్తున్నాం
ధనబలం కండబలం లేనిదీనులమై
జనమున్నాం గాని అవకాశాలు రాని వారమై
ఉద్యమాలుగా, కలాల సిరాలుగా, గొంతుల గోలగా
ప్రార్థిస్తున్నాం - పడిగాపుల పడుతున్నాం
మా మాదిగ గోల నాలకించండి
మా హక్కులన్నీ మాకిచ్చేయండి
మా కడుపు మంటలపై మొసలికన్నీళ్లు కార్చకండి
'ఎ. బి.సి.డి'ల వర్గీకరణ ప్రజాస్వామ్యంగా చేయండి.
దళితుల్లో దళితుల్ని
కొదమ సింహాలుగా మార్చుకుని మిమ్మల్ని
మట్టు పెట్టుకోకండి.



22\. గిట్ల కాలమొస్తదని
తెలియక పాయె
మాదిగోల్ల కోసం
ఎన్ని త్యాగాలో!
తెలిసి ఉంటే అపుడే ......
నిన్నటి దళిత నేతలు
నేడు ఏమంటున్నారు?!
అడ్డుగోడలు కూల్చకుండా
ఐక్యమత్యమంటే గెట్లా
సత్యాన్ని సంపినోడే
సత్యవంతుడైయిండు
మాదిగోనికి
అధికారమంటానె
వాళ్లెందుకో అదరిపడతుండ్రు
కులమొద్దంట్రా అంటే
నాది కులపిచ్చి అంటుండ్రు
కుల "పుచ్చు"ను
మాదిగ చెప్పుతో
ఎగదీసి దిగదీసి
జాడిస్తా జర జాగర్తగుండు
జమిడికిస్త జోగవ్వా!?

ఆనంద్

యల్లమ్మ జాతర

కాశీం మాదిగ

రోడ్డు మీద దండోరా

23. నా గుండె చప్పుడు డప్పు సాక్షిగా
నా వృత్తి చిహ్నం రంపె సాక్షిగా
నా జాతి సాక్షిగా జాంబవంతుడి సాక్షిగా
ఊరిచివర నాగుడిసె సాక్షిగా
ఉమ్మడి రిజర్వేషన్ సాక్షిగా
నేను కులదోపిడే కాదు
ఆర్థిక దోపిడి కూడా అనుభవిస్తున్నాను
నీ కాలికి రక్షక కవచం అయిన నేను
బతుకు చితికిన వాడను
కన్నీరు కతికిన వాడను
అందుకే!
జీవితం నన్ను పోరాటంలోకి
విసిరి కొట్టింది
"పోరాడి మీ హక్కుల్ని సాధించుకోండి!"
బాబసాహెబ్ మాట నాకు తూటా
అందుకే .....
దండోరా వేస్తున్నా!
నా రోడ్డు మీద దండోరా
ఊరూరా వినిపిస్తుంది
కొందరికి ఏవగింపుగా ఉండొచ్చు
అయితేనేం



నా జాతికి వెలుగు దివ్వె అయినపుడు
సిందన్న నా పాటకు ఆట అయ్యాడు
మాష్టరన్న నా పాటకు రాగమయ్యాడు
బైండ్లన్న నా పాటకు పల్లవయ్యాడు
డక్కలన్న తన డొక్కలో నన్ను దాచుకున్నాడు
వర్తమానానికి
నాది శబ్దంలేని మౌనపోరాటం
రేపు అదొక బాంబై పేలుతుంది!

తుడి మహేందర్

మాదిగ జీవితం

24. నేను 'మాదిగ'
అని తెలిసినప్పుడల్లా
ఆ కులం
మనది కాదుగా - అని
లోకం వేలెత్తి చూసినప్పుడల్లా
కన్నీళ్లే తొంగి చూసాయి
ఒంటరి రాత్రులే
ఎన్నో చేరువయ్యాయి
చాతుర్యాన్ని ప్రతిభను
చాటినపుడల్లా
ఆ కులం మాది కాదుగా
అని సమాజం
తలచినపుడల్లా
లోకమే ఏకాంతమయింది
బ్రతుకంతా శోకమయింది



25. నిజమేబావా!

నీవన్నది నిజంగాక నిజం!
ఆవేశాలు ఆనందాలు
మనసు వికలమయినా
అనధికార 'వార్త'లా ఆవలించడం
కొమ్మ మీది కోతికి తెలుసు
కొమ్మను నేను
చీకటిలో కనిపించిన మాట
అరికాలిలో ఆనె పెరిగింది
చూపు అలసిపోయింది
సూది చిగురించింది
నిప్పుకు తెలుసు
వేదిక నేను
కబ్బెల్లి పిలుపుతో
కప్పకు పెళ్లి చేసిన వారు
అవమానంలో
అంతరాల దొంతరులు నాకు తెలుసు
విశ్వమంతా వ్యాపించిన విప్లవం నేను
కలంపోతదే
అక్షరంపోతదే
పదంపోతదే
వాక్యం వాసనేస్తుందా?!
మాది + గోడు (డ)
ఆలోచన వేగాన్ని అనుసరించగలవా?



నాగప్పగారి సుందర్ రాజు

మాదిగోడు!

ఎండిన తంగెడు చెక్క ....
పొరాడుతున్న పసిగూటం ఒక వైపూ
అడుగు తీసి అడుగు వేస్తున్న ఆరె ఒక వైపూ
అనుమానమా - రా!
గల్లుబాను చూపిస్తా!
ముక్కుమూసుకోకుండా నిలబడగలవా?
నీ చేతికి పక్షపాతమా?
సూదెయ్యనా బావా!
కాలాన్ని శాసిస్తున్నా
మరదలు పిల్లను
తొడ సంబంధం
తాళి బరువు
ఎగతాళిగా ఉందా?
చంద్రమండలం మీద
చెప్పులతో పొరాడుతాను
ఇప్పుడే నిద్రలేస్తున్నావా బావా!
ఓంకార మమకారంలో
నులకమంచం కింద
నిన్న తన్నేసిన పాలముంత
నేడు ....
మాదిగ్గేరి మాట్లాడుతుంది
నవ్వరా నా సామి!

ఎదురింటోడు చూస్తున్నాడులే!
తప్పట తీసుకున్నా
జగిస్కా జగ్గిన్ ..... జగిస్కా జగ్గిన్
ఊరిలోకి బయలుదేరాను బావా!
చిట్లించుకోవడానికి
ముఖాలు లేవిపుడు
మొండి "గోడ"ను చూపి
మా జాతిని తిట్టిన రోజులు
అంతర్గత అంటరాని తనం సాక్షిగా
నారంపెను ముద్దాడుతావా?
మాదిగ మైదానం చూపిస్తా!
ఆ చివరిమెట్టు దిగలేవా?
రేడీ రూముకు రంగు పోలేదు
నీలంగోటా సంగతి నాకు తెలుసు
పంగ నా "మాల" వాడి "ప్రతిభ"
బావా! బావా! బాగా పాడుతావే ....
అవకాశవాదం అచ్చొచ్చిందా?
జనకన జగ్గినకన - జనకన జగ్గినకన
అతీకమంటే ....
వినవే బావా!
పీర్లపండగ వాయిదా.
ఒసినీయాడో!
ఎంతకమ్మని సంబోధన .....
నాకు ఇప్పుడు
ఏ భయం లేదు బావా!

కొత్త చెప్పలు కుడతావా?
ప్రేమించడానికి ధైర్యముందా?
కల్మషం లేకుండా కౌగిలించుకోవడం-
నీచేతనవుతుందా?
మీ వాళ్ళు బహిష్కరిస్తే?
నా తోలు తిత్తె మోయగలవా?
ఎనుగొడ్డు నంజిరిలోకి
యచ్చం కూడా లేదు ....
ఏమి చేయమంటావు
బావా!
నా మడికిలోకి
నీవు మిగిల్చిందే అది
నీ "గల గంట" కలగంటుంది
నా చేతులు నడుస్తున్నాయి
నేను "ఎత్తిన దాని" ని
తెరదించడం చేతకానప్పడు
ముసుగెందుకురా మొగడా!

వరపగుడి నుండి మొండికొడవలిలోకి ప్రేమతో ....

డా॥ కొల్లూరి చిరంజీవి

నేనూ..... మాదిగ వాణ్ణే!

అవును
నేను మాదిగ వాణ్ణే !
అయితే ఏం?
పుణ్యభూమిగా
చెప్పబడుతున్న
ఈ దేశంలో
పుట్టాలంటే
ఏదో ఓ కులంలో
పుట్టాలి తప్పక!
అందుకే ....
గత్యంతరం లేని
నా తల్లి
మాదిగవానిగానే
నన్ను కన్నది
ప్రతి మనిషి
స్థాయిని నిర్ణయించేది
అతని కులమే కదా !
ఆలస్యంగానైనా
నా కులమే
నా జీవితగమనాన్ని
నిర్దేశించింది,
నేను గర్వపడేలా చేసింది.
ఏ పైకులంలోనో
లేదా
ఓ బ్రాహ్మడిగానో



పుట్టివుంటే
ఈ వ్యవస్థ మారాలన్న
ఆలోచన కూడా
వచ్చిండేది కాదు.
నేను ....
ఈ దేశంలో
కాదు ...... కాదు ......
ఈ బ్రాహ్మణీయ వ్యవస్థలో
అట్టడుగు కులమైన
మాదిగవాడుగా
పుట్టడమే మేలైంది.
బ్రాహ్మణిజాన్ని
తుడిచిపెట్టడానికి
ఈ వ్యవస్థను
మార్చడానికి
అంబేడ్కర్
ప్రారంభించిన
కులనిర్మూలనా
పోరాటాన్ని
చివరికంటూ
కొనసాగించడానికి
మరేకులంలోనో కాకుండా
కాన్షీరాం
కులంలో పుట్టినందుకు
గర్వం నాలో తొణికిసలాడుతుంది

ఏ ఉన్నతకులం ఇవ్వలేని
అవకాశాన్ని
నాకిచ్చిన
నామాదిగకులానికి
ఋణపడి ఉన్నాను నేను
కులవ్యవస్థ వల్ల
బాధాస్పదులను
సమైక్య పర్చడం
నా జీవిత లక్ష్యం
మాదిగ చైతన్యంతోనే
అది ప్రారంభం
ఎందుకు కాకూడదూ?
అదే ....
నా ఋణ విముక్తికి మార్గం.
అందుకే!
ఈ పోరాటంలో
అగ్రభాగాన
నిలవడమే
నా జీవన ధ్యేయం!